# 12. జనమేజేయుడు

"నమస్కారం"

లోపలికి అడుగుపెట్టగనే కింది బెర్తు మీద కూర్చున్న అతను నమస్కారం చేశాడు.

నా వెనుక రావు లోపలికి వచ్చాడు. ఆయనకు కూడా అతను నమస్కారం చేశాడు.

సామాను సర్దే లోపలే రైలు కదిలింది.

"ఈ రెండు బెర్తులు ఇలా కాళీగా ఉంటాయేమోనని నేను భయపడ్డాను. ఇంత ఆలస్యంగా వచ్చారేం" అతనే తిరిగి ప్రశ్నించాడు.

"మేము రేపటికని రిజర్వేషను చేయించాము. కాని, వచ్చిన పని అయిపోయింది. ఈ న్యూఢిల్లీ స్టేషనులో రిటైరింగ్ రూములో ఉండి, రెస్టారెంటులో భోజనం చేయడానికి విసుగెత్తి, ఒక రోజైనా ముందుగా యిల్లు చేరుదామని బయలు దేరాము. అదృష్ట వశాత్తు ఈ రెండు బెర్తులు రిజర్వు చేయించు కున్నవారు రాక పోవడం చేత, ఆఖరు క్షణంలో కండక్టరు మాకిచ్చిడు." చెప్పవలసినదంతా రావు చెప్పాడు.

గ్రాండ్ ట్రంక్ ఎక్స్ ప్రెస్ పరుగందుకొంది.

"ఎంతవరకు వెళ్తున్నారు?" అడిగాడు ఆయన.

"తెనాలి". ఈసారి నేను జవాబు చెప్పాను.

సంభాషణ ఇంగ్లీషులోనే సాగుతోంది.

"అంటే, ఒక రాత్రి, ఒక పగలు, మరి కొన్ని గంటలు మనం కలిసి ప్రయాణం చేస్తామన్నమాట. ఇంతకీ నేనెవరో మీకు చెప్పలేదు. నాపేరు శంకర్. మద్రాసు దాటి కోయంబత్తురు వెళ్తున్నాను. " అతను మావేపు చూశాడు.

"నా పేరు మూర్తి, సివిలింజనీరుని, తెనాలి మునిసిపాలిటీలో పనిచేస్తున్నాను" అన్నాను నేను.

"నాపేరు రావు. నేను కూడా తెనాలి లోనే పనిచేస్తున్నాను. మేమిద్దరం కలిసి చదువుకున్నాం' ' అన్నాడు రావు.

"చాల బాగుంది. మనం ప్రయాణంలో హాయిగా కాలం గడపవచ్చు." అన్నాడు. శంకర్,

ట్రై వదులు చేసుకుంటూ. తరువాత ఆయన బట్టలు మార్చుకోడానికి లేచాడు.

శంకర్ సూట్‌కేసు నిండా లేబిళ్ళు - వాటిమీద లండన్, న్యూయార్క్, పారిస్, లాసాంజలీస్, ఫ్రాంక్‌ఫర్ట్, కెయిరో --- ఇంకా ఇంకా -- హాంకాంగ్, సిడ్నీ, టోకియో --- పేర్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతని అటాచీ కూడా చాల ఖరీదయినదే. అతను తొడిగిన సూటు చాల ఆధునికంగా ఉంది.

మేమిద్దరం బట్టలు మార్చుకొని వచ్చాము.

డైనింగ్ కారు బేరరు వచ్చాడు. అతను నాలుగు సాఫ్ట్ డ్రింకులు తెప్పించి, మా యిద్దరికి, మీద బెర్తుమీదనున్న అతని మనిషి కందసామికి యిచ్చి తానొకటి తీసుకున్నాడు.

సిగరెట్ల పెట్టె తీసి మా యిద్దరికీ ఇచ్చాడతను. మాకు అక్కరలేదని తెలిసి, "మీకు ఇబ్బందిగా ఉంటే నేనూ కాల్చను ఇవి ఆషెస్ ఆఫ్ రోజెస్ ... ఫిల్టర్డ్" అన్నాడు శంకర్.

"మీరునిరభ్యంతరంగా కాల్చవచ్చు. " అన్నాడు రావు.

సీసాలు తీసుకు పోడానికి నిలబడ్డ బేరరు, ఆ సిగరెట్టు పెట్టె వంక ఆబగా చూస్తున్నాడు.

"తీసుకో బ్రదర్!" శంకర్ బేరరుకో సిగరెట్టు ఇచ్చాడు.

సిగరెట్టు తీసుకోకుండా ఆ బేరరు తమిళంలో అతనినే ప్రశ్న వేశాడు.

శంకర్ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ జవాబు చెప్పాడు.

ఎవరిపేరో, కుప్పుస్వామి కాబోలు, అదే అర్థమయింది.మాకు ఆ పేరు చెప్పి తొందరగా బేరరు వెళ్ళిపోయాడు.

"వీడి పేరు పిళ్లే. మా వూరి వాడే. కుప్పు స్వామి అని మా వూరి వాడే మరొకడున్నాడు. వాడిని తీసుకురావడానికి వెళ్లాడు. వీళ్లని నాకు తెలుసు. " అన్నాడు శంకర్.

కుప్పుసామి, పిళ్లే వచ్చారు. వాళ్ల సంతోషానికి అంతే లేదు. రాత్రి భోజనాలు ఆర్డరు చేశాము. పైనున్న కందసామికి ఇండియన్ స్టైలు డిన్నరు, శంకర్‌కి వెస్టరన్ స్టైలు డిన్నరు, మా యిద్దరికి వెజిటేరియన్ థాలీలు.

రైలు వేగంగా పరిగెడుతోంది. చీకటి పడింది. బయట వర్షం పడుతున్నది. ఆకాశం మీద మెరుపుల ఛళకులు - ఉండుండి ఉరుములు. నేను షట్టర్లు దించాను.

కుప్పు సామి ఐస్ క్యూబ్స్ తీసుకొచ్చాడు, ఫ్లాస్క్‌లో వేసి సోడాలు పిళ్లే తెచ్చాడు.

" ఈ వెదర్ చాల బాగుంది. సావకాశంగా మాటా మంతీ ఆడుకొని,గ్లాస్ లోని అమృతాన్ని మెల్లగా చప్పరిస్తూ, కొంచెం ఆలస్యంగా భోజనం చేద్దామా?" శంకర్ అడిగాడు.

రావు నా ముఖంలోకి చూశాడు.

శంకర్ సూటుకేసు తెరచి, దాని లోంచి చాల ఖరీదైనవిదేశీ మద్యం సీసా ఒకటి తీసాడు.

దానితో రావు నా వేపూ చూడడం మానేశాడు.

"వెరీ గుడ్ ఐడియా" అన్నాడు రావు.

గ్లాసులో కొంచెం ఐసు, కొంచె మద్యం, సోడా నింపి రావుకి అందిచ్చాడు శంకర్.

ఆ విదేశీ మద్యం ఏ అయిదు వందల రూపయలో ఉంటుంది. ఈ మధ్యనే విదేశాల నుండి కొంత మంది యింజనీర్లు మా వూరు వస్తే వాళ్ళకోసం తెప్పించాము.

"పోనీ మరో సాఫ్ట్ డ్రింకు తీసుకోండి " అన్నాడు శంకర్. నేను అభ్యంతరం చెప్పలేదు.

శంకర్ కొద్దిగా చప్పరించే సరికి, రావు గ్లాసు పూర్తి చేశాడు.

పిల్లే మళ్లీ సోడా, ఐసు, మద్యం గ్లాసులో నింపాడు.

"రావు గారూ! నాకు చాల ఆనందంగా ఉంది. మనవాళ్ళు మనదేశం అంటే ఒళ్ళు మరచి పోతారు. మొన్న రాత్రి న్యూయార్కులో కంపెనీ మీటింగు జరిగింది. డిన్నరయింది. ఏదో వ్యాపార రీతిలో అంతా గడిచిపోయింది. వాళ్లెవరో, నేనెవరినో. ఇక్కడున్న వాళ్లం మనం నలుగురిమే అయినా, అన్న దమ్ములతో కలిసి ప్రయాణం చేస్తున్నట్లుంది." అన్నాడు శంకర్.

"మీ పెట్టె మీద ఎన్ని లేబుళ్ళున్నాయి? మీ గురించి ఎంతో తెలుసుకోవాలని ఉంది. " అన్నాను నేను.

"అవునవును. నేను ప్రపంచ మల్లా మా కంపెనీ తరపున తిరుగుతాను. స్కిన్ అండ్ హైడ్స్ మా కంపెనీ. ప్రతీ దేశంలో కనీసం ఒకటైనా మా ఆఫీసుంది. నేను పార్టనర్‌నే కాక మా నేజింగ్ డైరెక్టరును కూడా! అందు చేత చాల కాలం విదేశాలలో ఉండి ఏ రెండు నెలలకో, మూడు నెలలకో మన దేశం వస్తాను."

"మీకు వ్యవథి తక్కువయినప్పుడు, ఈ మూడు రోజుల రైలు ప్రయాణం పెట్టుకున్నారేం!' ' నేనడిగాను.

"మొదట రాత్రి పదిగంటల ఫ్లైట్‌కే పోదామనుకున్నాను. కాని, రేపు శనివారమని జ్ఞాపకం వచ్చింది. సోమవారం నాటికి ఇల్లు చేరుకోవాలి. అందు చేత రైల్లో సావకాశంగా ప్రయాణం చేస్తున్నాను."

"చూడండి మూర్తిగారు! వారి స్వంత విషమాలు అడగడం మంచిది కాదు. శంకర్ గారు! మీరు న్యూయార్క్ నుంచి వస్తున్నారు కదూ! అక్కడ వేష భాషలు, మనుష్యులు, ఆడవాళ్ళు...అంటే మీకు తెలుసు కదా! అటు వంటి విషయాల గురించి మాట్లాడండి." అన్నాడు రావు, గ్లాసులోని మత్తు తలకెక్కడంతో.

శంకర్ మంచి వక్త. విదేశాలలో రంగు రంగుల జీవితాన్ని, స్వేచ్ఛాచారిణులను, వాళ్ళ

అందాలను, అలవాట్లను చిన్న చిన్న ఉదాహరణలతో చెప్తూ సంభాషణ సాగించాడు.

"ఈమధ్య జరిగిన సంగతి. నయాగరా జలపాతం చూడాలని బఫెలో నగరం సాయంకాలానికి చేరుకున్నాను. హొటలులో బస చేశాను. ఓవర్ కోటు వేసుకొని బజారులోకి నడిచాను. బైట, మల్లెపూల రేకుల్లా, మంచు పడుతోంది. శనివారం సాయంకాలం - రోడ్ల మీద జనం పలచబడుతున్నారు. షోకేసుల్లోని బొమ్మల్ని చూస్తు నడిచాను. తిరిగి వచ్చే టప్పుడు ఒక చిన్న రెస్టారెంటులో దూరాను. డిన్నరు ఆర్డరు చేశాను. కౌంటరు దగ్గర ఒక నలభై యేళ్ళ ఆడమనిషి కూర్చుంది. డిన్నరు సెర్వ్ చేస్తున్న అమ్మాయి చాల అందంగా ఉంది. భోజనం ముగించి డబ్బు చెల్లిస్తుంటే కౌంటర్ దగ్గిరనున్నావిడ, నా కళ్ళలోకి చూస్తు అంది: "చాల కాలమయి ఇల్లు విడిచినట్లు కనిపిస్తున్నావు - నీ కళ్ళ నిండా కోరిక - నీకు సెర్వ్ చేసిన అమ్మాయి చాల మంచిది. డేటొకటి యిచ్చి, ఆనందంగా ఆమెతో కాలం గడపవచ్చు. హద్దులు మీరనంత వరకూ యిబ్బంది లేదు. హద్దులు మీరితే పెండ్లి, విడాకులు మొదలైన తగువులు వస్తాయి. " ఆ మాటలు విని నేను నీరు విడిచిపోయాను."

తరువాత శంకర్ పెట్టె తీసి విదేశపు పత్రికలు, బొమ్మలు చూపించాడు; చాల దేశాల విషయాలు చెప్పాడు. ఎక్కడా గొప్పలు చెప్పినట్లు అనిపించలేదు. అంతస్తులోనున్న మనిషి మాతో సరదాగా కాలం గడపడం అపూర్వ మైన విషయం.

ఇంతలో భోజనాలు వచ్చాయి. శంకర్ చేతిలోని గ్లాసు, మొదట నింపినది, అలాగే ఉంది. అతను మాటలలో పడి ఏమీ తాగి నట్లు లేడు. రావు మాత్రం మూడు గ్లాసులు పూర్తి చేశాడు. పిమ్మట హుషారుగా భోజనం చేశాడు.

శంకర్ భోజనం కూడా సరిగా చేయలేదు. కందసామి నిర్మొహమాటంగా తిన్నాడు.

శంకర్ సూటు కేసులోంచి రెండు మనీ పర్సులు తీసి, నాకొకటి, రావుకొకటి యిచ్చాడు. రెండూ విదేశాలలో తయారయ్యాయి. ఆ చర్మం ఎంత మృదువుగా ఉందో! లోపల లైనింగ్ దివ్యంగా ఉంది. ఒకొక్క దాని ధర వందలలోనే ఉంటుంది. ఒకొక్కప్పుడు అనుకోకుండా అదృష్టం కలిసి వస్తుంది. రావు పెట్టె తీసి పర్సులోపల పెట్టాడు. నేను కూడా హాండ్ బాగులో నాకిచ్చిన దానిని భద్రంగా దాచాను.

రావు పైకెక్కి పడుక్కున్నాడు. కందసామి శంకర్‌కి పక్క పరిచి, మీద బెర్తు మీదకి వెళ్ళి పోయాడు. సగానికి పైగా నున్న విదేశీ మద్యం సీసాని, మిగిలిన సోడాలు, మంచు - అన్నీ పిళ్ళైకి, కుప్పుసామికి యిచ్చాడు శంకర్.

శంకర్ నైట్ లైట్ కూడా ఆర్పి పక్కమీద కూర్చున్నాడు. అతను సిగరెట్టు కాలుస్తున్నాడు. దాని పొగలో తీయని వాసన - గులాబీల పరిమళం.

పొద్దున్న నేను లేచేసరికి తొమ్మిది దాటింది. రావు పది గంటలకు లేచాడు. తల నొప్పిగా

ఉందని మాత్ర వేసుకున్నాడు. శంకర్ చాల ఆలస్యంగా పదకొండు తరువాత లేచాడు. రాత్రి చాల వరకు అతను మేలుకొని ఉన్నాడు. తెల్లవారు వేళ నాలుగు గంటలకి ఒకసారి నేను లేచాను. అప్పుడతను పక్కమీద కూర్చొని సిగరెట్టు కాలుస్తున్నాడు.

వార్ధాలో మేమిద్దరం భోజనాలు చేశాము. భోజనం అయిన తరువాత, రావు తాను ఢిల్లీలో కొన్న వస్తువులు ఒకటీ, ఒకటీ తీసి చూపించాడు. పెళ్ళానికి మంచి నైలెక్సు చీర, పిల్లలకు ఫ్రాకులు, చంటి వాడికి ఆట వస్తువులు కొన్నాడు.

"ఒక రోజు ముందుగా ఇంట్లో అడుగు పెట్టగనే, అందరూ ఆశ్చర్య పోతారు. నిజానికి, మా ఆఖరి వాడు, నన్ను విడిచి ఉండ లేడు". అన్నాడతను పెట్టె తాళం వేస్తూ.

నేను కొన్నవీ అందరికీ చూపించాను. పళ్ళు, మిఠాయి, బొమ్మలు. శంకర్ మా యిద్దరివేపు, సామానుల వేపు కళ్ళప్ప గించి చూస్తున్నాడు.

శంకర్ ఆలస్యంగా భోజనం చేశాడు. రెండు దాటింది. పేరుకు భోజనమన్నమాట.

అతను ఏమీ మాటలాడలేదు. మళ్ళా పక్కమీద పడుక్కున్నాడు.

నాగపూరు వచ్చింది. ప్లాట్ ఫారం మీదికి రావు, నేను దిగాము. స్టాల్ దగ్గిర పెరుగు గారెలు చాల ఊరిస్తూకనిపించాయి. వాటి ధర కూడా హెచ్చుగా ఉంది.

"డబ్బులయిపోయాయి. ఢిల్లీలో అన్నీ కొనేశాను. ఇటు వంటి వాటి కింద ఖర్చుపెడితే, తెనాలిలో రిక్షాకి కూడా డబ్బులు మిగలవు" అన్నాడు రావు.

నా పరిస్థితి కూడా అలాగే ఉంది.

ఆ రాత్రికి మేమిద్దరం కాజీపేటలో, ప్లాట్‌ఫారం మీద పూరీలు కొనుక్కుతిని శనివారం ఫలహారం అయిందనిపించాము.

శంకర్ రాత్రి ఏమీ తినలేదు. కాఫీ మాత్రం తెప్పించుకున్నాడు. కందసామి లోటు లేకుండా డిన్నరు ఆరగించాడు.

రాత్రి పది దాటింది. ఎవరమూ నిద్ర పోడం లేదు.

శంకర్ పక్కమీద కూర్చున్నాడు.

"ఒకరోజు ముందుగా ఇల్లు చేరుకోడానికి మీరిద్దరూ తొందర పడుతున్నారు. అనుకున్న రోజుకి రెండు రోజుల తరువాత ఇల్లు చేరాలన్నా నాకు ఉత్సాహం కలగడం లేదు." అన్నాడు శంకర్.

రావు బెర్తు దిగి నా పక్కను కూర్చున్నాడు.

"మీ గురించి ఎంతో తెలుసుకోవాలని ఉంది. మీరు మనసులో ఏదో బాధ పడుతున్నారు. సుఖంగాని, కష్టం గాని మరొకరితో పంచుకుంటే హృదయం తేలిక పడుతుంది. " అన్నాను

నేను.

"ఇవాళ శనివారం. నా భార్య ఉపవాస ముంటుంది. రేపు ఆదివారం వ్రతం చేసుకుంటుంది. ఎల్లుండి ఆవిడకు నాతో మట్లాడడానికి వీలు పడుతుంది. మీరు ఇళ్లకు పోడానికి తొందం పడుతున్నారు. నేను వెళ్ళడానికి జంకుతున్నాను." అన్నాడు శంకర్.

"పోనీ, మీ వ్యాపారం గురించి చెప్పండి" అన్నాడు రావు.

శంకర్ సిగరెట్టు కాలుస్తున్నాడు. ఆలోచిస్తున్నాడు. ఈ రైలు తొందరగా విజయవాడ చేరితే, అతని గురించి తెలియకుండా పోతుందని బాధ పడ్డాను. ఒక పావు గంట తరువాత శంకర్ సంభాషణ మొదలుపెట్టాడు.

"బి. ఏ పాసయిన తరువాత కొంత కాలం ఉద్యోగం దొరకలేదు. మా మేనమామకు చేమంతి పొలాలున్నాయి. అతని ప్రోద్బలం వలన మద్రాసు మార్కెటులో పూల వ్యాపారం చేసే వాడిని. తరువాత అతని కూతురిని పెళ్ళి చేసుకున్నాను. వ్యాపారంలో పదేళ్ళు పని చేసి మంచి లాభం గడించాను. మా యింటిలో చుట్టాలు, పక్కాలు ఎప్పుడూ ఉండే వారు. ఇరుగు పొరుగువారు, అందరూ వచ్చి పూవులు, మరువం, దమనం అన్నీ పట్టుకొని వెళ్ళేవారు. వాళ్ళ ముఖాలలో ఆనందం వెల్లివిరిసేది. నా భార్య నన్ను ప్రాణంగా చూసుకునేది. నా తల్లి, ఉన్న ఒక్క కొడుకు, మంచి పని చేస్తున్నాడని సంతోషించేది. గుడికి రోజూ పూలు పంపించేది. కలకలలాడే యింట్లో ముగ్గురు పాపలు పుట్టుకొచ్చారు. పూల తోటల ఎరువు గురించి రైతులకు డబ్బిచ్చేవాడిని. వాళ్లు మా యింటిని పూలతో నింపేవారు. ఒక పది సంవత్సరాలలో నాకు నికరమైన లాభం పాతిక వేలు వచ్చినా, జీవితం మాత్రం పూల పడవ మీద, నిర్మలమైన శాంతి జలాల మీద ప్రయాణం చేసింది. ఆదరించే తల్లి, ఎదుగు చూసే పిల్లలు,ప్రేమించే భార్య, గౌరవించే స్నేహితులు - అది ఒక జీవితం.

"అనుకోకుండా ఒకనాడు వెంకటాచలం కలిశాడు.అతనూ నేను చదువుకున్నాం. అతను స్కిన్స్ అండ్ హైడ్స్ కంపెనీలో భాగస్వామి.తాను వేరే వ్యాపారం మీద మలేషియా వెళ్తున్నాడు. అతని స్థానం నాకిస్తానన్నాడు. లాభాలు, విదేశాల పర్యటన నాకు కళ్ళు కప్పాయి. లోతు పాతులు తెలియకుండా నేను అంగీకరించాను. వెంటనే నా దగ్గర నున్న పాతిక వేలు జమ కట్టి పార్టనర్ గా చేరాను.

"ఆరోజు శనివారం. అయిదు సంవత్సరాలకింద - పూల వ్యాపారం మాని తోళ్ల వ్యాపారం చేపట్టానని యింట్లో చెప్పాను. మా అమ్మ తల కొట్టుకొని ఏడ్చింది. నా భార్య చెప్పరాని దుఃఖాన్ని గుండెల్లో దాచుకొని కుమిలి పోయింది. పిల్లలు బెంగ పెట్టుకున్నారు.

"ఒక ఆరు నెలలు యిల్లు విడిచి వెళ్ళి పోయాను. నా బతుకు అడవుల్లో ....పుట్టల్లో ...అక్కడి పాములను పట్టి, వాటి చర్మాలతో విలాస వస్తువులను తయారు చేయించడం నా

పని. దేశంలో అన్ని రాష్ట్రాలు పర్యటించాను. అన్ని రకాల పాములను పట్టించాను. తయారయ్యే వస్తువులలో కొత్త డిజైన్లు ప్రవేశ పెట్టాను. విదేశాలలో మా సరకు గిరాకీ పెరిగింది. క్రమేపి మా యింటర్‌నేషనల్ సంస్థకు డైరక్టరుగా నియమింపబడ్డాను.

"ఇంటికి ఉత్తరాలు వ్రాసే వాడిని. పాములు,చర్మాలు, మనీ బాగ్‌లు....ఎన్నో విషయాలు ... ఆరు నెలల తరువాత యింటికి వెళ్ళాను. నా తల్లి నా ముఖం చూడకుండా గది తలుపు మూసుకుంది. మేనమామ మా పిల్లలను తనవూరు తీసుకుపోయాడు. తాళి గట్టిన నా భార్య, నాకు వీధి గదిలో భోజనం పెట్టింది. అక్కడ మా రైతులకు, పని వాళ్ళకు భోజనాలు పెడతాము.

" నా భార్య ముఖం ఎడతెగని ఏడుపుతో వివర్ణమయింది. నేను నెల నెలా పంపిన డబ్బు నాకు తిరిగి యిచ్చివేసింది. ఇక మీద డబ్బు పంప వద్దన్నది. తరువాత ...తరువాత ..అలవాటయి పోయింది. అప్పులచే పరిత్యజింపబడి, ప్రపంచం మీద పడ్డాను."

కొంచెం సేపు మౌనం. ఈ సర్పయాగం గురించి ఆయన ఇంకా వివరాలు చెప్పాడు. తలచుకుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. జంటలు విడిన పాములు, సంసారాలు తెగిన పాములు.

తరువాత అతను చెప్పలేక పోయాడు. అతని హృదయంలో కరడు కట్టిన బాధ ...నిష్కృతి లేని నరకం.

అతను మళ్ళామట్లాడాడు.

"ఇంట్లోకి అడుగుపెడితే ప్రాణాల మీద భయంతో తిరుగుతారు. నేను వెళ్ళిపోతే నిర్భయంగా చరిస్తారు. నాకు వేరే శాపం అక్కరలేదు. చేసిన పాపానికి శిక్ష ఈ జన్మకి పరిమిత మైతే మంచిదే! ఎన్ని జన్మాల కిది సాగుతుందో."

అతను ఉద్రేకంలో మాట్లాడ లే [illegible] కున్నాడు.

"నన్ను మా యింట్లో పాము కన్నా అన్యాయంగా చూస్తారు"

అటు పిమ్మట అతను మాట్లాడ లేక పోయాడు. కందసామి మాత్ర ఏదో యిచ్చి అతనిని పక్కమీద పడుక్కోబెట్టాడు.

విజయవాడ దాటి రైలు కృష్ణ మీద మెల్లిగా నడుస్తున్నది. రావు పెట్టెతీసి ఏదో వస్తువు కిటికీ లోంచి విసిరేశాడు. నేను కూడా నా హాండ్ బాగ్‌లోని మెత్తని పర్సును నదిలోకి విసిరాను.

తెనాలిలో దిగేటప్పుడు శంకర్‌తో చెప్పాలనుకున్నాను. రావు నా చెయ్యి పట్టుకొని, గబ గబ లాక్కుపోయాడు.